
ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025



కమిషనర్‌గా కృష్ణారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సాలూరు



స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా డిటివి కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతి సచివాలయం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇన్‌ఛార్జి కమిషనర్ బివి ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పట్టణ ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలేవీ?

- సిండికేట్‌గా దళారులు
- కారుచౌకగా కొనుగోలు
- నష్టపోతున్న రైతులు

ఎన్నో ఒడిదుడుకుల మధ్య మొక్కజొన్న సాగు చేసే రైతులు బాధలు అన్నీ ఇన్నీ కావు ప్రకృతి వైపరీత్యాలు ముంచుకొస్తున్నప్పటికీ మొక్కజొన్నపై మక్కువతో సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర విషయంలో మొండిచేయి చూపుతోంది. మద్దతు ధర లేక రైతులు దళారులకు అమ్ముకునే పరిస్థితి నెలకొంది. రైతులకు మద్దతు ధర ఇస్తామని, ప్రతి పంటనూ కొనుగోలు కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తామని చెప్పడమే తప్పా ఆచరణలో అమలు కావడం లేదు. నేటి వరకు కూడా కొనుగోలు కేంద్రాలు ఊసే ఎత్తటం లేదు దీనితో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు

సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో సుమారు 15వేల ఎకరాల్లో రైతులు ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధరగా రూ.2235గా ప్రకటించింది. మద్దతు ధర ప్రకటనలకే పరిమితం కావడంతో కొనుగోలు మాత్రం చేయడం లేదు. దళారులు ఇదే అదునుగా వారికి నచ్చిన ధరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా గత్యంతరం లేక దళారులకే పంట అమ్ముతున్నారు. ఈ ప్రాంతంలో ఉండే వ్యాపారులంతా ఒక సిండికేట్‌గా ఏర్పడి వారికి అనుకూలమైన ధరకు కొనుగోలు చేస్తున్నారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో ఎక్కువగా మొక్కజొన్న సాగు చేసే రైతులు ఉన్నారు. మొక్కజొన్న విస్తీర్ణం పెరగడంతో కందెలను విరడానికి, వాటిని గింజలుగా మలచటానికి యంత్రాలకు, కూలీలకు చాలా డిమాండ్ ఉంది. కూలీలు దొరక్క రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు వారికి నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో క్వింటాకు 2,400 వరకు కొనుగోలు చేయగా క్రమేపి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడతో వారికి నచ్చిన ధరను రైతులకు చెల్లిస్తున్నారు. దీంతో రైతులు అకాల వర్షాలతో ఇవి తడిస్తే నష్టపోతామనే భయంతో దళారులకు అమ్మేస్తున్నారు. ఇప్పటివరకు 50శాతం వరకు మొక్కజొన్నను అమ్మకాలు జరిగిపోగా, మిగతా పంట పొలాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలి



మొక్కజొన్న పంట తొందరగా చేతికంది లాభం పొందవచ్చు అన్న ఆలోచనతో ఎక్కువగా సాగు చేశాం. మొక్కజొన్న పండించడానికి ఎకరానికి సుమారు రూ.30 వేలు వరకు పెట్టుబడి అవుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది.

చల్లా సతీష్,
మరిపల్లి గ్రామం.

భూ సమస్యలపై 21న కలెక్టరేట్ వద్ద ధర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - మక్కువ

జిల్లాలో భూ సమస్యలపై ఈనెల 21న కలెక్టరేట్ వద్ద ధర్నా జరగనుందని,భూ సమస్యలు ఉన్న గిరిజనులు పేదలు, దళితులు ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని శంబరలో గిరిజన సంఘం మండల కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ అధికారులు భూసమస్యలను సక్రమంగా పరిష్కరించడంలేదని, ఈ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గిరిజన, దళితులు, పేదలు నష్టపోతున్నారని అన్నారు. మండలంలోని దళితులకు ఇచ్చిన 22 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిని, హైకోర్టు అనేక సంవత్సరాల క్రితం సర్వే చేసి రిపోర్టు కోర్టుకు సమర్పించమని ఆదేశాలు ఇచ్చినప్పటికీ రెవిన్యూ అధికారులు ఇంతవరకూ పట్టించుకోలేదని అన్నారు. అలాగే పాచిపెంట మండలం కుడుమూరులో 784 ఎకరాల భూమిని గిరిజనులు గత 60, 70 ఏళ్లు సాగు చేస్తున్నా, ఇంతర వరకు వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గిరిజనులు అనేకసార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ పట్టించుకోవడంలేదని అన్నారు. ఆ భూమితో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు ఇది తమ భూమి అని గిరిజనుల వద్ద దౌర్జన్యంగా అనేక ఏళ్ళుగా డబ్బులు వసూలు చేసే వారని వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం వారికి మద్దతుగా నిలవడంతో వారు పలాయనం చిత్తగించారని అన్నారు. ఈ భూమిని ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ రాజకీయ నాయకులు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని, కావున వెంటనే జిల్లా కలెక్టర్ సమగ్ర సర్వే జరిపించి సాగులో ఉన్న గిరిజనులందరికీ డి.పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మక్కువ మండలం శంబర, పెద్దవలస, తురుమామిడి ఇతర గ్రామాల్లో అనేక భూములు గిరిజన, దళితులవి అన్యాక్రాంతానికి గురయ్యాయని, వాటన్నింటిపై సమగ్ర విచారణ చేయాలని, పెత్తందారుల నుండి వెనక్కి తీసుకొని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అలాగే గిరిజన ప్రాంతంలో అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాల వరకు పోడుపట్టాలు ఇవ్వడానికి అవకాశం ఉందని, కానీ ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు గిరిజనులను మోసగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ ఫారెస్ట్ అధికారులు గిరిజనులను అటవీ ఉత్పత్తులు అమ్ముకోనీయకుండా అడ్డు తగులుతున్నారని అన్నారు. మక్కువ మండలంలో మెండంగి, బాగుజోల, ఆల గురువు, లవరకండి గిరిజన గ్రామాల్లో గిరిజనులు గత 50 ఏళ్లుగా పోడు భూమి సాగు చేస్తున్నప్పటికి పట్టాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేసి పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఈనెల 21న తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాకు ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు అల్లు ఆదినారాయణ, నాయకులు దాడి సింహాచలం, గిరిజన సంఘం నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక, అసంఘటిత సంఘాల నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

దేశవ్యాప్తంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ఇందిర పిలుపునిచ్చారు. శుక్రవారం కొమరాడలో ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందిర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను కాలరాస్తూ వారి హక్కులను హరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ఆయా యాజమాన్యాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు వేధింపులు అరికట్టేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటికి నిరసనగా మే 20న జరగనున్న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాలకు చెందిన కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ కొమరాడ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనురాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వై.గౌరినాయుడు, సిహెచ్‌డబ్ల్యు నాయకులు దుర్గ, యూనియన్ నాయకులు రాజేశ్వరి, విఆర్‌ఎ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం

గిరిజన సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రాంతాల్లో భూములపై గిరిజనులకే హక్కులు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ సంస్థ ప్రతినిధులు అజయ్ కుమార్, తిరుమల రావు, గోపాల రావు, చందర్ రావు ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు శుక్రవారం విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో గిరిజన భూ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు చేస్తూ వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన ప్రాంతవాసుల సమస్యలు కమిషన్ దృష్టిలో వున్నాయని, సంబంధిత చట్టాలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని కమిషన్ కోరుతుందని తెలిపారు.



మద్యం అమ్మకాలను పెంచే దిశగా కూటమి సర్కారు అడుగులు ముందుకు వేస్తోంది. మద్యాన్ని ఆదాయ వనరుగా భావించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మద్యం పాలసీని తీసుకు వచ్చి మద్యం షాపులను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించారు. వైసిపి హయాంలో ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహిస్తే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ మద్యం షాపులను రద్దు చేసి ప్రైవేట్ మద్యం షాపులను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వ్యాపారులకు మద్యం షాపులు కేటాయించడంతో కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. మద్యంపై ఇంకా ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ పర్మిట్ రూములకు అనుమతులు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది.

తాగడానికీ ఏర్పాట్లు

- వైన్‌షాపులకు అనుసంధానంగా పర్మిట్ రూములు
- మద్యం అమ్మకాలు పెంచేందుకు టిడిపి కూటమి సర్కారు ప్రయత్నాలు
- పర్మిట్ రూములతో బార్‌షాపులపై ప్రభావం
- జిల్లా వ్యాప్తంగా షాపులకు అనుమతులు!

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం జిల్లా వ్యాప్తంగా 169 మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వం మొదటి విడతలో 153 షాపులకు టెండర్లు వేసి ఖరారు చేయగా రెండో విడతలో కల్లుగీత కార్మికులకు మరో 16 షాపులను టెండర్ల ద్వారా కేటాయించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.102కోట్లు వరకు ఆదాయం వచ్చింది. లైసెన్స్ ఫీజు ద్వారా మొదటి సంవత్సరం ఒక్కొక్క షాపునకు రూ.65లక్షలు ఫీజు ద్వారా 109.85 కోట్లు ఆదాయం వస్తుంది. రెండో ఏడాది ఒక్కో షాపునకు రూ.72లక్షలు చొప్పున రూ.121.68కోట్లు ఆదాయం రానుంది. మద్యం షాపుల పర్మిట్ రూములకు అనుమతి ఇస్తే ఒక్కో షాపునకు ఏడాదికి రూ.5లక్షల వరకు ఫీజు వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.3.38కోట్లు ఆదాయం అదనంగా రానుంది.

పర్మిట్ రూములతో బార్ షాపులపై ప్రభావం

మద్యం షాపులకు పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తే బార్ షాపుల అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. 2022లో వైసిపి ప్రభుత్వం బార్ పాలసీని తీసుకు వచ్చింది. వైన్ షాపులు కంటే బార్ షాపులకు ఎక్కువ ధరకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. దీంతో వాటిలో మద్యం ధరలు కూడా ఎక్కువే. దీంతో బార్ షాపులలో మద్యం కొనుగోలు చేసేందుకు మందుబాబులు ఆసక్తి చూపడం లేదు. వైన్ షాపులలో లభ్యమయ్యే చీప్ లిక్కర్ బాటిల్‌పై ఎంఆర్‌పి రూ.99 ఉంటే బార్ షాపుల్లో రూ.102కు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కింగ్ ఫిషర్ బీర్ వైన్ షాపులలో రూ.200కే దొరికితే బార్ షాప్‌కు ప్రభుత్వం రూ.204కు సరఫరా చేస్తుంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ధరకు లాభం, సర్వీస్ చార్జీ వేసుకుని బార్ వ్యాపారులు అమ్మడంతో కొనుగోలు చేసేందుకు మందుబాబులు ఆసక్తి చూపడం లేదు. వైన్ షాపులకు పర్మిట్ రూములు ఇస్తే బార్ షాపులలో అమ్మకాలు పూర్తిగా తగ్గిపోతాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

మద్యం అమ్మకాలు పెంచేందుకు ప్రయత్నం

మద్యం అమ్మకాలు పెంచేందుకే పర్మిట్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పర్మిట్ రూములకు అనుమతులు ఇచ్చింది. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో ప్రైవేట్ మద్యం షాపులను రద్దు చేసి ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటు చేసింది. కూటమి సర్కార్ వచ్చిన తరువాత ప్రభుత్వ మద్యం షాపులను రద్దు చేసి ప్రైవేట్ మద్యం షాపులను ఏర్పాటు చేసింది. పర్మిట్ రూములకు అనుమతి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

2 బార్లు మూత

జిల్లాలో 26 బార్ షాపులు ఉన్నాయి. వీటిలో తగినంత వ్యాపారం అవ్వకపోవడంతో రెండు బార్ షాపులు మూత పడ్డాయి. వైన్ షాపులకు పర్మిట్ రూములు ఇస్తే బార్ షాపులన్నీ పూర్తిగా మూత పడే అవకాశం ఉంది. బార్‌షాపు లైసెన్స్ ఫీజు కింద ప్రభుత్వానికి ఏడాదికి రూ.55 లక్షలు చెల్లిస్తున్నారు. బిజినెస్ అవ్వకపోవడంతో రాజాంలో మూడు షాపులకు ఒక షాపు మూతపడింది. ఎస్.కోటలో ఉన్న ఒక్క బార్‌షాపు కూడా మూత పడింది. పర్మిట్ రూములకు అనుమతులు ఇస్తే ఆయా మిగతా వాటిపైనా తీవ్ర ప్రభావం పడనుంది.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు గ్రామదేవత శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండగ సందర్భంగా సాలూరు సీనియర్స్ క్రికెటర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనిషికి క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ క్రీడలపై మక్కువతో ఉండాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. అనంతరం తొలి బాల్‌ను బాట్‌తో ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, సాలూరు పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మాజీ కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని పురోహితుని వలసలో గల ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఈనెల 21న సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు జరుగుతుందని ప్రిన్సిపల్ ఎస్.అంజలీ దేవి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అధికారిక వెబ్సైట్ apms.apcfss. in ద్వారా హాల్ టికెట్స్ డౌన్లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9885569242, 9121573367, 7032996552 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణకు నిరసనగా కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

రాజ్యాంగ హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పాచిపెంటలోని జామ్యాన్ మసీద్ వద్ద శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు అబ్దుల్ బకారి, మమ్మద్ జమీన్ ఖాన్, షేక్ సుభాని, సయ్యద్ మగ్దూం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ బాకారి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసిందని, అలాగే వాక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను నియమించొద్దని, ధర్మాసనం కేంద్రానికి కోరిన కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వం న్యాయస్థానానికి గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వాక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని, వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికీ లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన సందర్భంగా రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని అన్నారు. ఈ చట్ట సవరణ ఇతర మతాల వారు ముస్లిమేతరులు ఈ వక్ఫ్ బోర్డులో సభ్యులుగా చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉందని అన్నారు. దీన్ని దేశ ప్రజలను మతపరంగా విభజించే కుట్ర ఈ సవరణలో బిల్లు ఉందని దీన్ని వ్యతిరేకించాలని, ఇది కేవలం ముస్లింలకే కాదు మొత్తం లౌకిక శక్తులకు సమైక్యంగా ముందడుగు వేయాల్సిన బాధ్యత అందరికీ ఉందని అన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ నుంచి ముస్లిం యాత్రలను నిషేధించాలని ఇస్లామిక్ ఆదేశాలు ఉన్నప్పటికీ సవరించిన చట్టం ముస్లిమేతరులను బోర్డుల్లో చేర్చి ముస్లింలకు గల రాజ్యాంగ హక్కులపై దాడి చేయడం సరికాదని దీన్ని ప్రజలంతా కూడా ఖండించాలని కోరారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ముస్లిము ప్రతినిధులు, సిపిఎం నాయకులు



ఈదురుగాలులకు మామిడిపల్లి లో రోడ్డుకు అడ్డంగా పడ్డ వృక్షాలు

ఈదురుగాలులకు నేలకొరిగిన భారీ వృక్షాలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో శుక్రవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని మామిడిపల్లి, మరిపల్లి, కందుల పదం, తోణాం, అన్నంరాజువ లసలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లు నేలకొరిగాయి. ఈ గాలులకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 12 విద్యుత్ స్తంభాలపై చెట్లు పడడంతో స్తంభాలు విరిగిపోయాయి. మామిడిపల్లి సమీపంలో పిడుగుపడి హరిశ్రీనుకు చెందిన ఆవు మృతి చెందింది. చెట్లు విరిగిపోవడంతో మామిడిపల్లి నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లి అన్ని వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడి నడుచుకొంటూ వెళాల్సి వచ్చింది.

బకాయిలు చెల్లించాలని కూలీల నిరసన

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఉపాధి హామీ పనులు చేసిన వేతనదారులకు ఇప్పటి వరకూ ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, రెండు పూటల పనిని రద్దు చేయాలని, ప్రతి కూలీకి 200 రోజులు పని కల్పిస్తూ, రూ.600 వేతనం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లిపర్తి పంచాయతీ పెదవెంకన్న చెరువు, బొడ్డలబంధ ఉపాధి పనులు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో డిసెంబర్ నుంచి కూలీలు నేటికీ 15 వారాల పాటు పనులు చేస్తున్నారని, చేసిన పనికి 14 రోజుల్లో కూలి చెల్లించాలన్న నిబంధన ఉన్నా నేటికీ నెలల తరబడి ఉపాధి బకాయిలు చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. ఉపాధి బకాయిలు చెల్లించకపోవడం వల్ల కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఉపాధి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోవడం వల్ల కూలీలకు పనులు తగ్గిపోయాయని, కావున ఏడాదికి 200 రోజులు పని కల్పిస్తూ రోజుకు రూ.600 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కూలీలు పనిచేస్తున్న చోట మంచినీళ్ళ, నీడ, మందులు వంటి సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మేట్లకు పారితోషం చెల్లించాలని, ఫోటో మస్తరు వేయడానికి సెల్ ఫోన్ పంపిణీ చేయాలని, రెండో పూట పని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. లేనిచో పోరాటాలకు సిద్ధపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు కె.నారాయణరావు, సింహాచలం, రాధిక, రేణుక తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి బకాయిలు చెల్లించాలని నిరసన తెలుపుతున్న వేతనదారులు


టేకరకండి ప్రాంతంలో సంచరిస్తున్న కింగ్ కోబ్రాలు

కురుపాంలో కింగ్ కోబ్రాల కలకలం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపంలో గల టేకరఖండి గ్రామ సమీపంలో కింగ్ కోబ్రా పాములు శుక్రవారం సంచరిస్తుండగా స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఈ రకం పాములు 10 నుంచి 18 అడుగులు పొడవు ఉన్నాయని, ఇది కాటేస్తే ఆస్పత్రికి తీసుకెళ్లిన బతికే పరిస్థితి లేదని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నామని ఏ క్షణంలో ఎలా ఉంటుందో తెలియదని, కావున అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఇటువంటి పాములను జనసంచారం లేనటు వంటి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వై.శివ నాగజ్యోతి నియమితులయ్యారు. ఆమె శుక్రవారం ఎమ్మెల్యే విజయచంద్రను మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా శివ నాగజ్యోతి ఎమ్మెల్యే విజయచంద్రకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు అందించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, జిల్లా ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో పంప్ ఆపరేటర్‌కు అస్వస్థత

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పంప్ ఆపరేటర్ డి.శ్రీనును తేనెటీగలు దాడి చేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణ వెనుక భాగంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం వద్ద గల ఉన్న వాల్వు ఇప్పేందుకు ఎప్పటిలాగే శుక్రవారం కూడా వెళ్లాడు. అంతకుముందు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు పొగ పెట్టడంతో గమనించని శ్రీను వాల్వ్ విప్పుతుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో దాడికి గురైన శ్రీనును సమీపాన గల 24 గంటల ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం శ్రీను ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు వైద్యులు తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణం వద్దు

ప్రజాశక్తి - సీతానగరం

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు సీటుకు ఇరువైపులా ప్రయాణంలో ఎక్కించరాదని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


సర్పంచిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

సర్పంచ్‌ను పరామర్శించిన పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వంగరలో సర్పంచ్ తిరుపతి కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల కాలంలో సర్పంచ్ తల్లి మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న పుష్పశ్రీవాణి సర్పంచ్ ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పి ఓదార్చారు. కార్యక్రమంలో వైసిపి కె. దీసయ్య, వైస్ ఎంపిపి ఎస్. శేఖర్, సర్పంచ్‌లు, ఎంపిటిసి లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ దేవత పండగను వైభవంగా నిర్వహించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం గ్రామ దేవత ఇప్పల పోలమ్మ పండగను వైభవంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీకి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇప్పలపోలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉత్సవాన్ని పార్టీలకు అతీతంగా నిర్వహించాలని, ఎటువంటి వివాదాలకు, గొడవలకు తావులేకుండా కమిటీ సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లు చూడాలని అన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ ఉత్సవానికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్టీ స్పెషాల్టీ సేవలు అందేది ఎప్పటికో?


ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు ఎప్పుడని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ ఒడిసి జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ, పార్వతీపురం మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరాలు మారుతున్నా పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు మల్టీ/ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు నోచుకోవడం లేదన్నారు. ఈ విషయంలో గతంలో వైసిపి, ఇప్పుడు కూటమి ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. గత నాలుగేళ్లుగా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి పనులు నత్తనడక నడుస్తున్నాయన్నారు. తక్షణమే కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయి బకాయి బిల్లులు చెల్లించి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురంలో మెడికల్, నర్సింగ్ కాలేజీలు నిర్మాణం జరిగేలా ప్రయత్నం చేయాలన్నారు. నాణ్యమైన పనులతో త్వరితగతిన పూర్తయ్యేలా పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సైట్ ఇంజినీరు ఎల్.దుర్గాప్రసాద్‌తో మాట్లాడి ఆస్పత్రి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అత్యవసర సేవలందించే ఆసుపత్రి పనులు నాసిరకంగా లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వారు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న అదనపు భవన నిర్మాణంతో పాటు ఆధునీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. 150 పడకల సామర్ధ్యానికి తగ్గట్టు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఐసియు, ఫంబర్, ఫార్మసిస్ట్, డోవి, ఎక్సరే, ఐసిజి తదితర విభాగాల్లో సరిపడా సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే వైద్యులు సమయపాలన పాటించేలా, రిఫరల్ కేసులు తగ్గేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి చిత్తశుద్ధితో త్వరగా మల్టీస్పెషాలిటీ సేవలు జిల్లా ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత అంగన్వాడీలదే

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఒక్క పిల్లలను ఆదర్శవంతంగా తయారు చేసేలా స్థానికంగా ఉండే అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిదేనని, దీన్ని ఒక బాధ్యతగా చేసుకొని పనిచేయాలని స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో కొత్తగా అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపికైన వర్కర్లు, ఆయాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను కొన్నేళ్లు మాత్రమే చూసుకోగలరని, ఆ తర్వాత మూడు నుంచి ఐదేళ్ల వరకు పూర్తిగా వారికి విద్యాబుద్ధులు, మంచి నడవడిక, ఆట పాటలు నేర్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ కేంద్రాల్లో పని చేసే సిబ్బందిపైనే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆ పిల్లలను సమాజానికి పనికొచ్చే పౌరులుగా తీర్చిదిద్దడానికి మొదటి మెట్టుగా మీరు కృషి చేయాల్సి ఉందని తెలిపారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులంతా తమ తమ కేంద్రాల్లో చక్కగా పిల్లలకు పౌష్టికాహారం అందించి చదువులు చెప్పి గ్రామంలో గర్భిణీలకు, బాలింతలకు సరైన సమయంలో ఆహారం అందించేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు ఐసిడిఎస్ ఇన్చార్జి పిఒ విజయలక్ష్మి, సాలూరు పట్టణ, మండల, పాచిపెంట, మక్కువ మండల అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, ముఖీ సూర్యనారాయణ, గుల్ల వేణుగోపాలరావు, పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


అంగన్వాడీలకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఉత్తరాంధ్ర అభివృద్ధే కూటమి ప్రధాన లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జునఅన్నారు. శుక్రవారం చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగార్జున మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలను తీసుకువచ్చి ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రమిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వ దుర్మార్గాల వల్లే రాష్ట్రం నుంచి, ఫ్రాంక్లిన్ టెంపుల్ టన్, లూలు, ఐటి సంస్థలు, ఇతర పరిశ్రమలు వెళ్లిపోయాయని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రూ.7 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ఇప్పటికే 48,789 మంది యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ అడుగులు వేస్తుందని తెలిపారు. టిసియస్ కంపెనీకి అతి తక్కువ ధరకే భూములు కేటాయింపు చేశారని వైసిపి నాయకులు గగ్గోలు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టిసియస్ కంపెనీ ఏర్పాటుతో 12 వేల మంది ఉత్తరాంధ్ర ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.


కంబరలో ఊరుబడి పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఊరు బడిని పరిరక్షించుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

మీ ఊరు బడిని మీరు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యుటిఎఫ్ మండల శాఖ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండలంలోని కంబరలో శుక్రవారం ప్రతి ఇంటికీ వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. గ్రామంలో ఉన్న పాఠశాల మోడల్ పాఠశాలగా ఎంపికైందని, అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు నియమించడం జరుగుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు స్వస్తి పలికి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, ఎం.ముకుందరావు, కె.సింహాచలం, ఎస్.గణేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. డ్రై డే, ఫ్రైడే సందర్భంగా మండలంలోని మొండెంఖల్, ఉదయపురం గ్రామాల్లో శుక్రవారం సందర్శించి అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ప్రజలకు డ్రై డే ఫ్రైడే కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలఅన్నారు. అలా అయితేనే పారిశుధ్య లోపం లేకుండా గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంటాయని, అటువంటిప్పుడే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.ధనుంజయరావు, ఎపిఒ పి.బావాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: దోమల వ్యాప్తి నిర్మూలనకు డ్రైడే అందరికీ అనువైన, సులభమైన, ఉత్తమమైన పద్ధతి అని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వెంకంపేటలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పర్యవేక్షణ చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలు, పాడైన, నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలు, టైర్లు, వాడని రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ కప్పుల్లో నీటి నిల్వలు గుర్తించి పారబోయించారు. దోమల లార్వా పెరగడానికి అనువుగా ఉన్న ప్రదేశాలను గ్రామంలో గుర్తించి వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ లో వైద్య సిబ్బంది మొబైల్ ఫోన్ ద్వారా అప్లోడ్ చేశారు. పంచాయతీ సిబ్బందితో కలిసి తదుపరి నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలో జ్వరాలు ఏమైనా గుర్తించడం జరిగిందా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే దోమల వ్యాప్తిని అరికట్టాలని, ఇందుకు అనేక పద్ధతులు ఉన్నాయని,డ్రైడే నిర్వహణ ఆచరించడానికి ప్రతి ఒక్కరికీ అనువైన, సులభమైన మార్గమని అన్నారు. అంతేకాక చిన్నచిన్న లార్వా ప్రదేశాలను కూడా గుర్తించి, నిర్మూలనకు ఉత్తమైన మార్గమని తెలిపారు. అనంతరం గ్రామంలో ఎన్సీడి సర్వే తీరుపై ఆరా తీసి ఆన్లైన్ నమోదు పరిశీలించారు. మంచానికి పరిమితమైన దీర్ఘకాలిక రోగి గృహ సందర్శన చేసి ఆరోగ్య స్థితి పరిశీలించి తగు సూచనలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తూ మందులు వాడుతున్న తీరును గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, వైస్ ఎంపిపి ఎస్.జగన్నాథం, సూపర్వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం జిఎం రత్నం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కురుపాంలో డ్రైడే- ఫ్రైడే గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

గరుగుబిల్లి: దోమల వ్యాప్తి చెందకుండా లార్వాదశలోనే నిర్మూలించాలని ఎంపిడి జి.పైడితల్లి అన్నారు. మండలంలోని దళాయివలసలో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీటి బావుల్లో చేపట్టిన క్లోరినేషన్‌ను పరిశీలించిన అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరుస్తున్నట్టు తెలిపారు. బోరు బావులు, రక్షిత మంచినీటి పథకాల సమీపంలో మురుగునీరు నిల్వ ఉండకుండా ఉండేలా గ్రామపంచాయతీ కార్యదర్శులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి చింతల వెంకటకురిమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకి, బలిజిపేట, వెంగాపురం, అరసాడ, గంగాడ, గళావిల్లి, అజ్జాడ, శివరాంపురం వివిధ గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. పలుచోట్ల శిలువను మోస్తూ ఏసును గూర్చి వివరిస్తూ పురవీధుల్లో ఊరేగింపు కొనసాగించారు. సర్వ లోక పాపుల కోసం ఏసు మరణించి, వారు పొందాల్సిన శిక్ష ను శుక్రవారం తాను మరణించి నిత్య నరకం నుంచి తప్పించిన రోజని, అందుకే మనుషులకు ఇది గుడ్ న్యూస్ అని గుడ్ ఫ్రైడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట విచారణలోని కతోలిక క్రైస్తవ విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు శిలువ మీద పడిన శ్రమలను అప్పటి కాలానికి తగినట్లుగా వేషధారణలతో ప్రదర్శించారు. కంబగూడ లొయోలా సెంటర్ నుండి గొయిది ఫాతిమామాత దేవాలయం వరకు పాదయాత్ర చేసుకొంటూ వెళ్లారు. కార్యక్రమంలో విచారణ ఫాదర్లు విద్యాసాగర్, శౌరి, సిస్టర్లు ఝాన్సీ, సుదీప్త, పెద్ద సంఖ్యలో విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రంలో గల రావాడ కూడలి వద్ద ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి, దొనక వీధిలో ఉన్మ ఇమ్మానీయేలు లూథరన్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలను

పాస్టర్ రెవరెండ్ డి.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.ప్రదీప్, డి.రాజరత్నం, డి.జాన్, డి.జయ కుమార్, కోట సుందర్ సుదర్శన్, రత్నమ్మ, సుధా, ఈశ్వరరావు, మజ్జిబాబు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చినబోగిలి ఆర్సీఎం చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో చర్చిల్లో గుడ్ ఫ్రైడేను జరిపి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కుర్మాన శ్రీనివాసరావు, దేవతల రామారావు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్సిఎం చర్చి పరిధిలో ఫాదర్ సునీల్ కుమార్ జోషి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు నేతృత్వంలో పట్టణంలో ఏసు క్రీస్తు వేషధారణలో భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండ గ్రామంలోని అగాపే ఫుల్ గాస్పల్ చర్చిలో ఓఫిర్ మినిస్ట్రీస్ ఇంటర్ నేషనల్ పార్వతీపురం మన్యం జిల్లా అధికార ప్రతినిధి పాస్టర్ వి.నిరీక్షణ్‌కుమార్ శుభ శుక్రవారం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు, పాస్టర్ పాలక సురేష్ కుమార్ ఉన్నారు.

వీరఘట్టం : స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయం, ఆర్సిఎం, ఇమ్మానియేలు, సీయోను ప్రార్థన మందిరంతో పాటు తలవరం, బిటువాడ, నడుకూరు, వండువ, తూడి, నీలానగరం, కంబర, గడగమ్మ, కొట్టుగుమ్మడ, నర్సిపురం తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సిఎం చర్చి ఫాదర్ రాజ్ ఆధ్వర్యంలో కస్పా వీధి నుండి ప్రధాన రహదారి మీదుగా ఏసుకు శిలువ వేసినట్టు భక్తుల వేషధరణ అలంకరణతో ర్యాలీగా వెళ్లి ప్రచారం చేపట్టారు. తెలుగు బాప్టిస్ట్ దేవాలయంలో పాస్టర్ వి.శంకర్ ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలు గూర్చి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.


బలిజిపేటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


పార్వతీపురం ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

మక్కువ : మండలంలోని గుడ్ ఫ్రైడే వేడకలు పలు చర్చిల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తుప్రభు 41 రోజులు ఉపవాసంతో ఉండి ప్రార్ధన చేస్తూ ముగింపు చేపట్టారు. క్రీస్తు జీవిత చరిత్రను మక్కువలో నాటక రూపంలో ఫాతిమామాత విచారణ ప్రజలు పుర వీధుల్లో తిరుగుతూ క్రీస్తు కోసం చాటి చెబుతున్న కొన్ని దృశ్యాలు, విచారణ ఫాదర్ వి.మరియదాసు ఆధ్వర్యంలో ఘనంగా ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, హోలీక్రాస్ సిస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు సెయింట్ జోన్స్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ సునీల్ జోసెఫ్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు దీనుల కోసం చేసిన శిలువ యాత్రను కళ్లకు కట్టినట్లుగా వేషధారణను వేసి చూపించారు. సెంట్ పీటర్స్ పాఠశాల నుంచి పండా వీధిలో గల సెయింట్ జోన్స్ చర్చి వరకు ఏసు శిలువ యాత్రలో వేలాది మంది క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. ఈ యాత్రలో చర్చి విచారణ సంఘ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పాల్గొన్నారు. బెలగాంలో కార్మిక జోజప్ప చర్చి విచారణ కర్త ఫాదర్ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో యేసు శిలువ యాత్ర ఆర్సిఎం కాంప్లెక్స్ సమీపంలో ఉన్న చర్చి నుండి బెలగాంలో ఉన్న కార్మిక జోజప్ప ఆలయం వరకు క్రీస్తు శిలువ యాత్ర జరిగింది. ఈ సందర్భంగా క్రీస్తు సంకీర్తనలను ఆలపిస్తూ క్రైస్తవులు కొనసాగించారు.

గరుగుబిల్లి: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని పలు రగామాల్లో గల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గరుగుబిల్లి విచారణ కర్త ఫాదర్ జోసఫ్ రమేష్ ఆధ్వర్యంలో పుర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.


వేసవి దుక్కులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి తిరుపతిరావు

వేసవి వర్షాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుత వేసవిలో అడపాదడపా వర్షాలు పడుతున్నందున రైతులు దుక్కులు దున్ని నవధాన్యాలు చల్లుకుంటే నేల సారవంతమవుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కర్రివలసలో రైతు ఎల్.నారాయణరావు పదెకరాలకు నవధాన్య విత్తనాలను చల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవధాన్య విత్తనాలు సాధారణ పచ్చిరొట్ట విత్తనాల కంటే మెరుగ్గా నేల లోపల, బయట జీవ వైవిధ్యాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడుతూనే నేలను సారవంతం చేస్తుందని అన్నారు. కావున రైతులంతా నవధాన్యాలను తప్పకుండా చల్లుకోవాలని సూచించారు. ఏకపంట విధానంలో ప్రతి సీజన్లో ఒకే పంట వేస్తుండడం వల్ల ఒకే రకమైన వేరు వ్యవస్థలు ఒకే రకమైన జీవజాలానికి నిలయంగా మారుతాయని అన్నారు. అపుడు ఒకే రకమైన పోషకాల లభ్యత మాత్రమే పంటకు అందుతుందని, కావున భూమి లోపల ఉన్న అన్ని పోషకాలను పంటకు అందించాలంటే నవధాన్యాలు చల్లడం వల్ల భూమి లోపల అనేక రకాల పంటలతో అనేక రకాల వేరు వ్యవస్థలు ఉండడం వల్ల అనేక రకాలైన సూక్ష్మజీవులకు నిలయంగా మారుతుందని అన్నారు. తద్వారా అనేక రకాల పోషకాలను పంటలకు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు కావున రైతులు తమ పంట పొలాలను సారవంతం చేసుకునేందుకు నవధాన్యాలను తప్పనిసరిగా చల్లుకోవాలని సూచించారు. ఇప్పటికే మండలంలో 2వేల కేజీల నవధాన్యాలను రైతులకు పంపిణీ చేశామని, వీటిని ప్రస్తుతం వేయబోయే మొక్కజొన్న, పత్తి పంటలకు ముందుగా చల్లుకుని కలియ దున్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ టు విజయ్ ఐసిఆర్‌పి సుమలత, ప్రకృతి సిబ్బంది పాల్గొన్నారు.

'శేఖర్‌పాత్రుడిని పదవి నుంచి తప్పించాలి'

ప్రజాశక్తి - కురుపాం

కొమరాడ మండల కన్వీనర్ శనాపతి ఉదయశేఖర్ పాత్రుడికి కన్వీనర్ పదవి తప్పించి వేరే వారికి అవకాశం ఇవ్వాలని మాజీ జడ్పీ చైర్మన్ గులిపల్లి సుధా, కొమరాడ మండల టిడిపి నాయకులు నంగిరెడ్డి మధు, దేవకోటి వెంకటనాయుడు శుక్రవారం ఎమ్మెల్యే జగదీశ్వరికి గుమ్మలక్ష్మీపురంలో గల తన క్యాంప్ కార్యాలయం ఫిర్యాదు చేశారు. అనంతరం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ముఖ్య నాయకులను కలిసి ఎమ్మెల్యేని కలవడానికి కోసం సమావేశం పెట్టుకుంటే దాన్ని కొందరు వ్యతిరేక గ్రూపు అనే మమ్మల్ని ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు. తాము ఎప్పుడూ ఎమ్మెల్యే వర్గమేనని, ఎమ్మెల్యేతోనే ఉంటామని అన్నారు. శేఖర్ పాత్రుడికి కాపు కార్పొరేషన్ డైరెక్టర్, మండల కన్వీనర్, క్లస్టర్ ఇన్చార్జి పదవులు ఉండగా ఆయన భార్యకు టిడిపి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు పదవులు ఉన్నాయని, కావున ఆ ఒక్క కుటుంబానికి నాలుగు పదవులు ఉండడం సమంజసం కాదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు ఇచ్చిమని తెలిపారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించి పరిశీలకులను పంపించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని 31 పంచాయతీల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ నియమాలి ప్రకారమే టిడిపి కమిటీలు

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల విషయంలో టిడిపి ఎన్నికల కమిటీ నియమాల ప్రకారం గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ పరిశీలకులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎటువంటి ప్రకటనలు గానీ, వివాదాస్పద వ్యాఖ్యలు కానీ చేయకూడదని వివిధ హోదాల్లో ఉన్న నాయకులను తెలుగుదేశం పార్టీ ఆదేశించిందని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నా, ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నా ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకుల దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కరించుకోవాలే తప్ప బహిరంగంగా ఎటువంటి ప్రకటనలను చేయరాదని తెలిపారు.

డిఎల్ఎస్ఎ కార్యదర్శిగా కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా గాజువాక అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు మేరకు విజయనగరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా న్యాయ సేవా అధికార సిబ్బంది స్వాగతం పలికినారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని లక్ష్మీ నారాయణపురం గ్రామానికి చెందిన జక్కు దాలినాయుడు (82) శుక్రవారం అనారోగ్య కారణంగా మనస్తాపం చెంది గ్రామంలో గల బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్సై సంతోషి కమారి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మృతుడి భార్య 12 ఏళ్ల క్రితం మరణించడంతో ఒంటరిగానే జీవితాన్ని కొనసాగిస్తున్నారు. అతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ ఎవరి జీవితం వారు కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు వ్యాధిని భరించలేక మనస్థాపంతో ఈ ఘటనకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు శవానికి పంచనామా జరిపి, వివరాలు నమోదు చేశారు.

కారును ఢీకొన్న లారీ.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని శక్తి నగర్ కాలనీ ఎదుట పార్వతీపురం - బొబ్బిలి ప్రధాన రహదారిపై లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో వెనుక వస్తున్న కారు, ఆటో లారీని ఢీకొనడంతో ఆటో డ్రైవర్ కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్ను, లారీని రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. శక్తి నగర్ కాలనీ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. ప్రమాదాలు జరగడానికి గల కారణం ఆ ప్రదేశంలో రోడ్డుకు ఒక వైపు కృంగిపోవడం, పాడైపోవడం, రోడ్డుపై అడ్డుగా చిన్న గోడను కట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక కాలనీ ప్రజలు చెబుతున్నారు. ఇకపై పమాదాలు జరగకుండా ఉండాలంటే సంబంధిత అధికారులు గోడను తొలగించి కృంగిపోయిన రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.